**ఈ జన్మ చాలు, పునరపి జననం పునరపి మరణం బాధాకరం. జన్మరాహిత్యం లభిస్తే చాలు - అనుకొంటారు కొందరు. ఈ జన్మలో అనుభవించవలసినది, అనుభవించ కోరినది ఎంతో మిగిలిపోయిందే - అని వాపోతారు పలువురు. అన్ని రకాలవారు గిట్టక మానరు. ఎక్కడికి పోతారో తెలియదు. ఒకవేళ అలాంటి వారిని ఎక్కడో అక్కడ పట్టుకొనడం సంభవమైతే - తిరిగి ప్రపంచంలో పడండి అంటే వారేమంటారో!**

సాయంకాలం స్కూలునుంచి ఇంటికి వస్తున్నాను. ఊళ్ళోకి వచ్చేసరికి రామాలయం దగ్గిర జనం గుమిగూడి ఉన్నారు. ఏమిటో, ఏం జరిగిందో అర్థం కాలేదు. నెమ్మదిగా సైకిల్ దిగి, స్టాండ్ వేసి ఆలయం ఆవరణలోకి వెళ్ళాను.

మండపం మీద ఓ స్వాములవారు కూర్చుని తమలో తామే ఏదో మంత్రం వల్లిస్తున్నారు. జనం అందరి దృష్టి ఆయనమీదే ఉంది. పిచ్చి పిచ్చిగాని ఇలాటి దొంగ సాధువులు ఈ మధ్య మరీ ఎక్కువైపోయారు. ఆ మధ్య ... కాకినాడ ముద్దుల స్వామివారు గుర్తు వచ్చి నాలో నేనే నవ్వుకున్నాను.

"ఏమిటి, పంతులుగారూ! ఇప్పుడే వస్తున్నారా బడినుంచి?" రామయ్య తాత పలకరించాడు.

"అవును, తాతా! అసలు ఏమిటి విషయం? ఎవరీయన?" నేనడిగాను.

"ఏమో నాకూ సరిగా తెల్దు, బాబూ! ఎవరో సాములంటీయన. ఎంత కాలంనుంచో ఇమాలయాల్లో తపోసు చేసినాడంట. సచ్చినోళ్లని బతికించే వరం పొంది తిరిగొచ్చినాడంట."

చచ్చిన వాళ్ళు తిరిగి బ్రతకట మేమిటి? నాకేం బోధపడలేదు.

ఈసారి స్వాములవారికి దగ్గిరగా వెళ్లి చూశాను. ఆయన ముఖంలో ఏదో తేజస్సు వెలిగిపోతూంది. నిర్మలంగా, నిశ్చలంగా కూర్చొని ఏదో ధ్యానిస్తున్న ఆయన వంక ఎక్కువ సేపు చూడలేక పోయాను. మానవ శక్తికి అతీతమైన ఏదో దివ్యశక్తి ఆయనలో ఉందనటంలో అతిశయోక్తి లేదనిపించింది.

రామయ్య తాత చెప్పిన దానిలో అబద్ధం లేదు. చచ్చిన వాళ్లని బ్రతికించే శక్తి పొందిన వాడేనటాయన! నాకు తెలిసిన వాళ్ళంతా అదే మాట చెప్పారు.

ఎవరైనా సరే ఒక వెయ్యి రూపాయలు చెల్లిస్తే, వారు కోరుకున్న మనిషిని తిరిగి బ్రతికిస్తారట ఆయన! అయితే తిరిగి బ్రతికిన మనిషి మరో అయిదు సంవత్సరాలు మాత్రం జీవిస్తాడట! కాని, ఒక్క షరతు. ఇప్పుడు తిరిగి బ్రతకవలసిన మనిషి చనిపోయి కనీసం నేటికి మూడు సంవత్సరాలు అయి ఉండాలి. అంతే కాదు, తిరిగి బ్రతికిన మనిషిని తనకు బ్రతకాలని ఉన్నదీ, లేనిదీ స్వాముల వారు స్వయంగా అడుగుతారు. ఆ మనిషి తిరిగి జీవించటానికి ఇష్టపడకపోతే స్వాములవారు చేసేదేమీ లేదు. కాని ఆ మనిషి కోసమై వెయ్యి రూపాయలు చెల్లించిన ఆసామీకి సగం డబ్బు మాత్రం తిరిగి చెల్లిస్తారు.

"ఇంతవరకు ఎవర్నయినా బ్రతికించారా?" నాతో విషయమంతా చెప్పిన సుబ్బారావును అడిగాను.

"అయ్యో, బ్రతికించక పోవడమేమిటి? మన మునసబుగారి అబ్బాయి నాయుడు వెయ్యి రూపాయలు కట్టి తన తండ్రిని బ్రతికించ మన్నాడు. స్వాములవారు ఏవో మంత్రాలు చదివి తమ ముందర ఉన్న అగ్నిగుండంలో ఏదో పొడరు లాంటిది వేశారు.

"చచ్చి అయిదేళ్లయిన వెంకటస్వామిగారు నవ్వుతూ గుండంలోంచి బయటికి వచ్చారు. మా కళ్లని మేమే నమ్మలేకపోయా మనుకో! 'ఏమండీ! మీకు తిరిగి జీవించాలని ఉందా?' అన్నారు స్వామి. ఏమనుకున్నారో ఏమో వెంకటస్వామిగారు ఏమీ మాట్లాడ లేదు. ఒక్క నవ్వు నవ్వి ఇష్టం లేదన్నట్లు తల ఊపారు.




మనిషిలోని
మంచి

'నాన్నగారూ, మేమంతా మీకోసం ఎంత బాధపడుతున్నామో తెలుసా? కనీసం మాకోసం, మా ఆనందంకోసం మీరు ఊఁ అనాలి.' నాయుడు బ్రతిమాలాడు. కాని ఆయన కొడుకుతో కూడా ఒక్క మాట మాట్లాడలేదు. ఆయనకు కావలసిన వాళ్లంతా తిరిగి బ్రతకటానికి ఒప్పుకోమన్నట్లు ఆశగా ఆయన ముఖంలోకి చూశారు. కాని ఆయనకి ఆ ఆశ లేదు. స్వాములవారు మళ్ళీ అడిగారు. ఈసారీ వెంకటస్వామిగారు తమ అసమ్మతినే తెలియచేశారు. స్వామివారు మరో మంత్రం చదివారు. వచ్చినవారు వచ్చినట్టే మాయమయ్యారు వెంకటస్వామిగారు."

నా కేమిటో నమ్మాలనిపించ లేదు. ఇదంతా ఏదో కట్టు కథలా ఉంది. అసలే చావులు తక్కువై, పుట్టుకలు ఎక్కువై జనాభా పెరిగిపోయిందని ప్రభుత్వం గోల పెడుతున్న ఈ తరుణంలో ఈయన లాంటి స్వాములు చచ్చిన వాళ్లని కూడా తిరిగి బ్రతికిస్తూంటే ప్రభుత్వం ఊరుకుంటుందా? ఏమో, ఇదంతా అయోమయంగా ఉంది.

చీకటి పడేసరికి జనం రద్దీ మరీ ఎక్కువయింది. ప్రెసిడెంటుగారు రెండు పెట్రోమాక్స్ లైట్లు తెప్పించి మండపంలో వేలాడ దీయించారు. నాకు మనసులో ఈ చిత్ర మేదో స్వయంగా చూడ్దామని ఉంది. కాని, మరో మనిషిని బ్రతికించటానికి ఇంకా రెండు మూడు గంటలు టైము పడుతుందట. వీలుంటే మళ్లీ రావచ్చు అనుకొంటూ గుడి బయటకు వచ్చి సైకిల్ తీసుకున్నాను. అప్పటికే సోడా లమ్ముకునే వాళ్లకి, సిగరెట్లమ్ముకునే వాళ్లకి మంచి గిరాకీ తగిలింది. రెండు మూడు సైకిల్ స్టాండ్స్ కూడా అవతరించాయి.

* * *

"జానకీ?" అంటూ తలుపు తట్టాను. నవ్వుకుంటూ వచ్చి తలుపు తీసింది జానకి.

"ఇది విన్నారా? ..." సుబ్బారావు చెప్పిందే ఆశ్చర్యంగా నాతో చెప్పబోయింది.

"విన్నాను."

"ఏమిటండీ ఈ చిత్రం! అసలు ఇలాటివి జరుగుతాయా అని?"

"ఏమో? అదే నేనూ నమ్మలేకుండా ఉన్నాను." అంతకంటే జానకితో ఆ విషయం ఇక మాట్లాడలేదు.

భోజనంచేసి, మంచంమీద నడుం వాల్చాను. నా ఆలోచనలు స్వాముల వారిని దాటి మరో మార్గానికి మళ్లటం లేదు.

అమ్మ పోయినప్పటినుంచీ ఇంటికి కళే పోయింది. స్కూలు నుంచి ఇంటికి రాగానే, "అమ్మా" అంటూ గాని గుమ్మంలో అడుగు పెట్టేవాణ్ణి కాదు. అలాంటి అమ్మను స్వాముల వారి దయవల్ల తిరిగి బ్రతికించుకోగలిగితే? అబ్బ! ఎంత మంచి ఆలోచన! అమ్మ ఇప్పుడే బ్రతికినట్లు, నన్ను "బాబూ" అని దగ్గిరికి తీసుకుంటున్నట్లు అనుభూతి కలిగింది. రేపు నా దగ్గిర ఉన్న ఆరు వందలకి సాయం మరో నాలుగు వందలు తగిలించి అమ్మను తిరిగి బ్రతికించుకోవాలి. నా మనసులోని ఆలోచన వెంటనే జానకి చెవిని వెయ్యాలనిపించింది. హఠాత్తుగా లేచాను. కాని ... నా కాళ్లకు ఏవో సంకెళ్లు అడ్డు తగిలాయి. అమ్మ పోయి ఇంకా రెండేళ్లైనా కాలేదు. కనీసం మూడేళ్లయినా అయితే కాని, తిరిగి బ్రతికే అవకాశం లేదు. సుబ్బారావు మాటలు గుర్తువచ్చాయి. దిగాలుగా మంచంమీద వాలిపోయాను.

పోనీ, నాన్నను బ్రతికించుకుంటే? ఆయన పోయి ఇప్పుడే ఆరేళ్లు కావస్తూంది. ఒక్కగా నొక్కణ్ణని అల్లారుముద్దుగా పెంచారు నాన్న. ఆయన్ని తిరిగి సజీవంగా చూడటం కన్న అదృష్టం మరోటి లేదు. నాన్నగారి రూపం నా కళ్ల ముందు కదిలింది.

నాన్న నా చేత చిన్నతనంలో బిస్కట్లు తినిపించటం దగ్గిరనించి ప్రతి సంఘటనా సినిమా రీలులా కళ్లముందు తిరుగుతూంది... నాన్న


కెల్వినేటర్ కొంటే మీరు పెట్టే డబ్బుకు మించిన విలువ సమకూరినట్టే



మీకు మీరే రుజువు చేసుకోండి—ఇతర రకాలతో పోల్చి చూడండి. కెల్వినేటర్ ఎంత విశాలమైనదో పని చేస్తున్నా ఎంత నిశ్శబ్దంగా వుంటుందో...నూటికి నూరు పాళ్ళు సమర్థవంతమైనది.
రిఫ్రిజరేటర్‌ను కొనే ముందు కెల్వినేటర్ ఎంత ఉపయోగకరమో తెలుసుకోండి.
వివరాలకు నేడే వ్రాయండి.

ఈ క్రింది కూపన్ కత్తిరించి పోస్టులో వేయండి.

కెల్వినేటర్ రిఫ్రిజిరేటర్ల వివరాలు తెలియజేయండి.

పేరు ______________________

విలాసం ______________________

______________________

మేలిరకాన్ని మాత్రమే కోరేవారికి
కెల్వినేటర్ Kelvinator

స్పెన్సర్ & కంపెనీ లిమిటెడ్,
153, మౌంట్ రోడ్,
మద్రాసు-2

Benson's 1599-B TEL

పక్షవాతంతో మంచంలో పడి మూలుగుతున్నారు. నా ఆలోచనలు ఇకముందుకు వెళ్లలేదు.

ఒక వేళ నాన్నను తిరిగి బ్రతికించుకున్నా ఈ రోగంతో మరో అయిదేళ్లు మంచంలో మూలుగుతూ, తనను తిరిగి బ్రతికించినందుకు సంతసించటానికి మారుగా నన్ను ప్రతి క్షణం శపిస్తారేమో!

'వద్దు, నాన్నా, వద్దు. నిన్ను తిరిగి సజీవుణ్ణి చేసి, సుఖాలకు నిలయమైన ఆ స్వర్గానికి దూరం చేసి, మరోసారి నిన్నీ నరకానికి లాక్కురాలేను.'

భగవంతు డిచ్చినంతలో నాకు అన్న వస్త్రాలకు లోటు లేదు. ఓ వెయ్యి రూపాయలు ఖర్చుచేసి మరణించిన నా ఆత్మీయుల్లో ఒకరిని తిరిగి బ్రతికించుకోగల ఆర్థిక స్తోమత నాకు ఉంది. అయితే, ఆత్మీయు లనుకున్న అమ్మా, నాన్నల విషయం ఇక ఆలోచించి ప్రయోజనం లేదు. అయితే, ఇక ఎవర్ని బ్రతికించుకోవాలి? రాత్రి అంతా ప్రశ్న గుర్తు నా ముందు నాట్యం చేసింది. తెలతెలవారుతూండగా నా ప్రశ్నకు జవాబు దొరికింది.

మరునాడు ఆదివారం. స్కూలుకి సెలవు. ఉదయమే లేచి కాలకృత్యాలు తీర్చుకుని, ఆరు వందలు జేబులో వేసుకుని మరో నాలుగు వందలకోసం నారాయణ ఇంటివైపు బయలుదేరాను.

నారాయణ ఇంటి తలుపు జారవేసి ఉంది. వీథిలో ఎవ్వరు లేరు. వెళ్లి తలుపు తట్టుదామని అనుకుంటూనే లోపలనుంచి వస్తున్న మాటలు విని ఆగిపోయాను.

"నారాయణా! నేను నీకోసమే చెబుతున్నాను. ఆలోచించుకో. చచ్చినవాడు తిరిగి వచ్చి సాక్ష్యమిస్తాడా అనే భరోసాతో మీ తమ్ముణ్ణి చంపి, వాడి ఆస్తి అంతా కైంకర్యం చేసుకున్నావు. కోర్టుకి కూడా తెలియని ఈ పచ్చినిజం ఈ నాలుగేళ్ల నించీ ఎలాగో నాలో దాచుకున్నాను. ఈ నిజం కోర్టులో చెప్పనందుకు గాను నాకు ప్రతిఫలం ముష్టి నాలుగు వందలు చేతిలో పెట్టి నన్ను నవ్వుతూ సాగనంపావు! కాని, ఇప్పుడు కాలం కలిసి వచ్చింది. పోతే పోయాయి. వెయ్యి రూపాయలు నావి కావనుకుని స్వామివారి ఒళ్లో పోసి, నీ తమ్ముణ్ణి బ్రతికిస్తాను. హంతుడిచేతే నీ హత్యకు సాక్ష్యం చెప్పిస్తాను. చూడు నా తడాఖా! అప్పుడు నువ్వెక్కడుంటావో ఆలోచించు!"

"ఒరేయ్, సూరిబాబూ! జరిగిందేదో జరిగిపోయింది. కావాలంటే నీకు మరో నాలుగు వందలు ఇచ్చుకుంటాను. నా తమ్ముణ్ణి మాత్రం బ్రతికించకు. వాడు బ్రతికాడా, నే చచ్చానే!" నారాయణ గొంతు దీనంగా ఉంది.

లోపల జరుగుతున్న దేమిటో నాకు చాలా వరకు అర్థమయింది. ఇన్నాళ్లూ నా ప్రాణమిత్రు డనుకున్న నారాయణ ఎలాంటి వాడో తెలిసేసరికి ... ఇక వాడి ముఖం చూడ బుద్ధి వెయ్యలేదు. నాలుగు వందలంటే ఎవరు పడితే వారే ఇస్తారు నాకు, నన్ను చూసి కాకపోయినా నా ఆస్తిని చూసి. చప్పుడు చెయ్యకుండా నారాయణ ఇంటి మెట్లు దిగాను.

• • •

రామాలయంలో జనం ఇసక వేస్తే రాలనంతగా ఉన్నారు. ఎలాగో సందు చేసుకుని లోపలికి వెళ్లి, స్వాములవారికి వెయ్యి రూపాయలు సమర్పించుకున్నాను. నా వంతు వచ్చేసరికి సాయంకాలం నాలు గయింది.

"ఎవర్ని బ్రతికించాలి, బాబూ?" స్వామివారు ప్రశ్నించారు.

"శాస్త్రిగారిని!"

"అంటే పూర్తిపేరు?"

"శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి."

ఒక్కసారి జనమంతా నా వైపు వింతగా చూశారు. "ఏమిటి, మాస్టారూ! శాస్త్రిగారు మీకు బంధువులా?" 'ఈయ...కేం పిచ్చి పట్టలేదు గద!'

"జనంలోంచి రకరకాల మా...లు వినవస్తున్నాయి. స్వాముల వారి ముఖంలో కూడా ఇదివర...ప్పుడూ లేని ఒక చిరునవ్వు వెలిగిపోతూ...ంది.

ఆయ నేవో మంత్రాలు వల్లించారు. ప్రజలంతా శాస్త్రీజీ రాక కోసం వెయ్యి కళ్లతో చూస్తున్నారు. నిమిషాలు యుగాల్లా గడుస్తున్నాయి. అదుగో! గుండంలోంచి నవ్వుతూ, చేతులు జోడించి, శాస్త్రిగారి మూర్తి మళ్లీ ఈ లోకంలోకి వస్తూంది. ఆ కళ్లలో అదే కాంతి, ఆ నవ్వులో అదే ఆత్మీయత, ఆ పొట్టి శరీరంలో అదే గట్టి గుండె.

ఒక్కసారి జనమంతా—"శాస్త్రీజీకి జై" అంటూ నినాదాలు చేశారు. "జై జవాన్, జై కిసాన్" — గుడి అంతా నినాదాలతో మారుమ్రోగుతూంది.

"మీకు తిరిగి జీవించాలని ఉందా?"


15551

TRADE MARK

సుఖంగా ధరించేందుకు

రోజా బనియన్లు

మా ఆంధ్రప్రదేశ్ ఏజంట్లు:

గాయత్రీ ఏజన్సీస్,

విజయవాడ 1.

Roja

BANIANS

ఉత్పత్తిదార్లు:

మద్రాస్ నిట్టింగ్ ఫ్యాక్టరీ, తిరుపూర్-4.

స్వామి ప్రశ్నించారు శాస్త్రీజీని.

ఆయన నోటంట ఏ మాట వస్తుందో అని చెవులు రిక్కించుకు వింటున్నారు జనం. నిశ్శబ్దం. ఏమ ... నుక్కున్నా వినిపించేటంత ... ం.

"లేదు!"

"మీరు అలా అనటానికి వీల్లేదు. మీరు మాకోసం బ్రతకాలి. మా శాస్త్రి మాకు కావాలి." కోటి గొంతుకలు కోటి రకాలుగా అరిచాయి, అర్థించాయి.

"ఇంతకీ నన్ను తిరిగి బ్రతికించ టానికి వచ్చిచ్చి ముందుకి వచ్చినవా రెవరు?" — శాస్త్రిగారి ప్రశ్న.


ఏనుగుముందు ఎలకలా శాస్త్రి గారి వ్యక్తిత్వం ముందు నాకు నేనే మరీ చిన్నవాణ్ణనిపించాను.

"నేను..." అన్నాను ఎలాగో.

నా ముఖంలోకి చూసి ఓ చిన్న నవ్వు నవ్వి, ఓ నిట్టూర్పు విడిచారు శాస్త్రీజీ.

"మీరు మాకు కావాలి, శాస్త్రీజీ! మీలాంటి నాయకులు మాత్రమే అధోగతిలో ఉన్న నేటి ఈ దేశాన్ని ఉన్నతస్థితికి తీసుకు రాగలరు. మీ లాటి దేశభక్తులు, నిస్స్వార్థపరులు నేటి మన దేశానికి ఎంతో అవసరం..." నేను చాలా మాట్లాడదా మనుకున్నాను. కాని, ఏదో మాట్లాడాను. మరి, మాటలు రాలేదు నా నోటంట.

"నాకు తిరిగి బ్రతకాలని లేదు, బాబూ! నాకు తెలుసు. నే నిలా అంటే 'ఎందుకు లేదు?' అంటూ ఎదురు ప్రశ్న వేస్తారు మీరు. నేను మళ్లీ ఈ లోకంలోకి వస్తే అసలే అవకతవక లుగా ఉన్న నేటి మన దేశ రాజకీయాలు మరీ గొడవల్లో పడతాయి. అసలు నేను పాత కాంగ్రెసు వాణ్ణో, కొత్త కాంగ్రెసు వాణ్ణో నిర్ణయించటమే కష్టమవు తుంది. ఏదో ఆ పరమాత్ముని దయ వల్ల మీ అందరి చేత మంచి అని పించుకుని ఈ లోకం విడిచి వెళ్లి పోయాను. మీ అందరి హృదయా ల్లోను నాకు చోటుంది. నా స్థానం అక్కడే. ఇక నా కీ నాయకత్వాలూ వద్దు. రాజకీయాలూ వద్దు."




చిత్రం — చంద్ర (హైదరాబాదు-29)

"అంతేనా, శాస్త్రీజీ?" — ప్రజ అంతా దీనంగా చూశారు.

శాస్త్రి సమాధానంగా మరో చిరు నవ్వు నవ్వారు.

"ఏం శాస్త్రీజీ! మీకు బ్రతకాలని లేనట్లే కదూ?" స్వామీజీ మరోసారి అడిగారు.

"లేదు, స్వామీజీ! కాని, ఒక్క మాట. మీరు ఎన్నో సంవత్సరాలు కృషిచేసి, ఎన్నో కష్ట నిష్ఠురాల కోర్చి మరణించిన మానవుణ్ణి తిరిగి బ్రతి కించే ఈ దివ్య సిద్ధి పొందారు. కాని ఇంతవరకూ చనిపోయిన మనుషుల్లో బహు కొద్దిమంది మాత్రమే తిరిగి బ్రతకటానికి ఇష్టపడ్డారు. నూటికి తొంభై మందికి ఇహలోకంకన్న పరలోకమే బావుంది.

"నిజానికి మీ వంటి తపశ్శాలురకు నేను చెప్పదగ్గవాణ్ణి కాను. అయినా ఒక్క మాట. మీరు మరణించిన మనుషులను తిరిగి బ్రతికించటం కన్న, నేడు చాలామంది మనుషుల్లో మర ణించిన దయ, జాలి, న్యాయం, ధర్మం వీటిని తిరిగి బ్రతికించటానికి మీ శక్తులను ఉపయోగిస్తే చాలా బాగుం డేది. కేవలం మనిషి ఎక్కువ కాలం బ్రతికినంత మాత్రాన ప్రపంచం బాగు పడదు. 'మనిషిలోని మంచి' ఎక్కువ కాలం బ్రతకాలి."

స్వామివారు మరి మాట్లాడలేదు. శాస్త్రిగారి శరీరం చూస్తూండగానే అదృశ్యమయింది. స్వామివారు నా దగ్గిరికి వచ్చి వెయ్యి రూపాయలు నా చేతిలో పెట్టారు. "ఇదేమిటి, స్వామీ! నా కివ్వవలసినవి అయిదు వంద లేగా?" అన్నాను నేను.


"లేదు, బాబూ! ఇక నేనీ వ్యాపారం చేయదలుచుకోలేదు. శాస్త్రిగారు నా కళ్లు తెరిపించారు. మనిషిలోని మంచిని బ్రతికించే సిద్ధి పొందాకే మళ్లీ ప్రజల్లోకి వస్తాను."

స్వామీజీ తమ వద్ద ఉన్న ధన మంతా పేదలకు దానం చేసి ఎటో వెళ్లిపోయారు.

* * *

"మిమ్మల్నే! ఎంత అదిరా... మటుకు అప్పుడే ఏడయింది, ఇంకా ఏం నిద్ర? లేవండి. కాఫీ రెడీ అయింది" అంటోంది నాకు.

కళ్లు నులుముకుంటూ మంచం దిగి, పేస్ట్, బ్రష్ తీసుకుని ... లోకి వెళ్ళాను. ... బయింంటో బాణాలు ... రాత్రి వచ్చిన కల గుర్తు వచ్చి నాలో నేనే నవ్వుకున్నాను. ★



బుస్సున పొంగి

ఫోటో — పి. గురుమూర్తి